## క్లుప్తంగా

### ముఖ్యమంత్రి అనుభవం ఏమైంది


దవులూరి దొరబాబు

సామర్లకోట: అనుభవం ఉన్న ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు విజయవాడ ముప్పులో ఏమైయిందని వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ప్రశ్నించారు. విజయవాడ వరదలపై ప్రభుత్వ వైఫల్యాన్ని ఆయన సోమవారం విలేకరులకు తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలను ప్రభుత్వం పూర్తి స్థాయి అప్రమత్తం చేయలేకపోయిందని ఆయన ఆరోపించారు. ప్రమాద పరిస్థితిలో ఉన్న వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించడంలో విఫలమైయిందన్నారు. సొంతవారిని కాపాడేందుకే బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారన్నారు. వరదల్లో చిక్కుకున్న వారికి కనీస వసతులు, ఆహారం, నీరు తక్షణమే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వరదలో 50 మంది మృతి చెందడం బాధాకరమైన సంఘటన అని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది మంది విజయవాడలో ఆకలితో అలమటిస్తున్నారన్నారు. వరద బాధితులను ఆదుకోవడానికి పార్టీల రహితంగా అందరూ స్పందించాలని ఆయన పిలుపునిచ్చారు.

### గణపతికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలో గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద సాంస్కృతిక కార్యాక్రమాలు ఏర్పాటు చేశారు. స్థానిక పోలమ్మగుమ్మం సెంటర్‌లో లక్ష్మీగణపతి విగ్రహానికి గణేష్ యూత్ ఆధ్వర్యంలో చెరకు గెడలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### నూకాలమ్మ హుండీ ఆదాయం రూ.7.65 లక్షలు


నూకాలమ్మ ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ వారి ఆలయానికి హుండీల ద్వారా రూ.7,65,921 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి టీవీ సూర్యనారాయణ తెలిపారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్ కుమార్‌బాబు నాయుడు సమక్షంలో సోమవారం ఆలయ హుండీలను లెక్కించారు. 93 రోజుల కాల వ్యవధిలో అమ్మవారి ఆలయానికి రూ.7,65,921ఆదాయం సమకూరిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆసాదులు, సేవాసంఘం మహిళలు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

### అలరించిన చిన్నారుల నృత్యం


పిల్లలకు మెమెంటోలు అందజేస్తున్న ఎస్సై మౌనిక, నిర్వాహకులు

పెద్దాపురం: స్థానిక మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయకుని గుడి వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం 40 మంది బాలబాలికలు ప్రదర్శించిన భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రముఖ కళాకారుడు పొలమరశెట్టి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్సై మౌనిక, మహారాణి సత్రం మాజీ చైర్మన్ కనకాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు మెమెంటోలు అందజేశారు. తొలిత ఎస్సై మౌనికను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సందక శ్రీను, పాలకుర్తి సతీష్, కాపుగంటి కిషోర్ తదితరులు ఉన్నారు.

### టిడ్కో గృహాల పరిశీలన


టిడ్కో ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన ఆర్డీఓ కిషోర్

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో ఉప్పువారి సత్రం ఎదురుగా ఉన్న టిడ్కో గృహాలను కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో 80 సంవత్సరాలు దాటిన వృద్ధులు, గర్భిణులు, పిల్లల వివరాలను సిద్ధం చేయాలని మెప్మా సిబ్బందిని ఆదేశించారు. ఏలేరు కాలువ సమీపంలో టిడ్కో ఇళ్ల సముదాయం ఉండడంలో ఆ ఇళ్లల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందనే సమాచారం మేరకు ఆయన ఆ ఇళ్లను పరిశీలించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఉన్న టీటీడీ కల్యాణ మండపంలో వరద బాధితులకు పునరావాసం ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఏలేరు కాలువ ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ కౌన్సిలర్ బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


నాగులాపల్లి కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగిస్తున్న దృశ్యం


గొల్లప్రోలు సూరంపేట వద్ద వరద ఉధృతి పెరగడంతో పడవలపై వెళుతున్న వైద్య సిబ్బంది


కొమరగిరిలో ముంపునకు గురైన వరిపొలం


రైతులను అప్రమత్తం చేస్తున్న వ్యవసాయాధికారులు

# గుండె చెరువవుతోంది..!

- ఉగ్రరూపం దాల్చిన ఏలేరు
- పొంగిపొర్లుతున్న సుద్దగెడ్డ
- ముంపులో లోతట్టు కాలనీలు


గొల్లప్రోలులో చెరువును తలపిస్తున్న వరి పొలాలు

పిఠాపురం: ఏలేరు ప్రాజెక్టులోని అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో పిఠాపురం నియోజకవర్గం జలమయమయ్యేందుకు సిద్ధంగా ఉంది. పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో వేల ఎకరాల్లో పంటలు నీటమునిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. గొల్లప్రోలు ఈబీసీ కాలనీ, సూరంపేట, చిత్రాడ ఈబీసీ కాలనీ వంటి లోతట్టు ప్రాంతాలు చెరువులుగా మారిపోయాయి. స్థానికులు వరద నీటిలో జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. వరద నీటి ప్రవాహంలో జాతీయ రహదారి సైతం మునిగిపోయే అవకాశాలు ఉండడంతో 216వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఆటంకం లేకుండా ఎన్‌హెచ్ఏఐ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఏలేరు, సుద్దగెడ్డ వంటి కాలువలకు పలు చోట్ల గండ్లు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**నీట మునిగిన పొలాలు**

పిఠాపురం మండలంలోని రాపర్తి, పిడింద్డొడ్డి ప్రాంతాల్లో ఏలేరు కాలువ పొంగి పొర్లడంతో వ్యవసాయ భూములు జలమయమయ్యాయి. గ్రామాల్లోకి సైతం భారీగా వరద నీరు వస్తుండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య, వరి, సెరికల్చర్ పంటలకు పుట్టినిల్లయిన గొల్లప్రోలు మండలాన్ని వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఇక్కడి రైతులు వరదలతో ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఇటీవల వరదలు వచ్చి రైతులు తీవ్రంగా పంటలు నష్ట పోయారు. కాగా మరోసారి వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగెడ్డ ఆధునీకీకరణ చేయకపోవడం వల్ల ఏటా ఈ పరిస్థితి తప్పడం లేదు. వేల ఎకరాలకు సాగునీరు అందించే ఏలేరు కాలువ ఏటా వర్షాకాలంలో ఈ మండలానికి శాపంగా మారుతోంది.

**గొల్లప్రోలు మండలంలో...**

ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో ఏలేరు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో గొల్లప్రోలు నగర పంచాయతీతో పాటు మండలంలోని గ్రామాలు నీట మునిగాయి. గత మూడు రోజులుగా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు గొల్లప్రోలు మండలాన్ని ముంచెత్తింది. రెండు వారాలుగా వేసిన వరి నాట్లు, పత్తి, మిరప, బంతి, చిక్కుడు, ఆగాకర, టమాటా, బొబ్బర్లు, వంగా, బెండ దొండ, బీర ఇతర వాణిజ్య పంటలు నీట మునిగాయి. సుద్దగెడ్డ పొంగి పొర్లుతుండడంతో గొల్లప్రోలు సూరంపేట వద్ద రహదారులు నీట మునిగాయి. రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది రోజుల క్రితం వచ్చిన వరద నుంచి తేరుకుంటున్న తరుణంలో మళ్లీ వరద ముంచెత్తింది. మండలంలో ఇప్పటివరకూ సుమారు 1700 హెక్టార్లలో వరి, పత్తి, మిరప ఇతర వాణిజ్య పంటలు ముంపునకు గురైనట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. రానున్న రెండు రోజుల్లో మరింత వరద ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలం చెందుర్తి, తాటిపర్తి, వన్నెపూడి తదితర గ్రామాల్లో వరి పంటలు పూర్తిగా నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుద్దగెడ్డ పొంగి పొర్లుతుండడంతో లోతట్టు కాలనీలు నీట మునిగి వీధులు చెరువులుగా మారిపోతున్నాయి.

**ముంపు నివారణకు ముందస్తు చర్యలు**

కొత్తపల్లి: ఏలేరు ప్రాజెక్టులోని అదనపు జలాలను దిగువకు విడుదల చేయడంతో మండలంలోని అధికారులు అప్రమత్తమయ్యారు. ముంపు నివారణకు ముందస్తు చర్యలు చేపట్టారు. ముంపునకు గురయ్యే రమణక్కపేట, నాగులాపల్లి, ఇసుకపల్లి ప్రాంతాల్లో సోమవారం రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు పర్యటించారు. ఏలేరు కాలువ గట్లను పరిశీలించి పలు చోట్ల గండ్లను పూడ్చివేశారు. కాలువల్లో పెరిగిపోయిన గుర్రపు డెక్కను తొలగించారు. రైతులను అప్రమత్తం చేశారు. కొమరగిరి శివారున సుమారు 25 ఎకరాలు వరి పంట ముంపునకు గురైనట్లు తెలిపారు.


నాగులాపల్లిలో ఏలేరు కాలువ గండిని ఇసుక బస్తాలతో పూడ్చుతున్న కార్మికులు

# దబ్బ కాలువకు గండి


కాండ్రకోటలో తెగిన దబ్బ కాలువ తాత్కాలిక బ్రిడ్జి


దబ్బకాలువను పరిశీలిస్తున్న జేసీ మీనా


ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలిస్తున్న జేసీ


పెద్దాపురం మండలంలో మునిగిన వరి పంట

- ఏలేరు కాలువ ఉధృతం
- వరద ముంపులో 400 ఎకరాల పంట
- బెంబేలెత్తిపోతున్న రైతన్నలు
- ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన జేసీ రాహుల్ మీనా, ఆర్డీఓ జేఎస్ రామారావు

పెద్దాపురం: ఏలేరు ప్రాజెక్ట్ నుంచి సుమారు 20వేల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో పెద్దాపురం మండలంలోని ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం రాత్రి మండలంలోని కాండ్రకోట దబ్బ కాలువ తాత్కాలిక బ్రిడ్జికి గండి పడడంతో కాండ్రకోట, కట్టమూరు, తూర్పుపాకల, జె.తిమ్మాపురం గ్రామాల రైతుల రాకపోకలు నిలిచి పోయాయి. ఆ గ్రామాలతో పాటు వడ్లమూరు, పులిమేరు తాటిపర్తి గ్రామాల్లో సుమారు 400 ఏకరాల వరి పంటలు, కాలువను ఆనుకుని ఉన్న కాలనీలు ముంపునకు గురయ్యాయి. విషయం తెలుసుకున్న పెద్దాపురం ఆర్డీవో సీతారామారావు స్థానిక తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఇరిగేషన్ ఏఈ వీరబాబు, ఎస్ఐ మౌనికలతో కలిసి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది ఏటిపట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సోమవారం దబ్బకాలువను పరిశీలించారు. పెరుగుతున్న వరద ఉధృతికి ప్రాణ నష్టం వాటిల్లకుండా ప్రజలను సురక్షత ప్రదేశాలకు తరలించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 150 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు జేసీ తెలిపారు. గంటగంటకు పెరుగుతున్న వరద నీటిని దృష్టిలో పెట్టుకుని ఏలేరు కాలవకు ఆనుకుని ఉన్న ఆయా గ్రామాల ప్రజలను సురక్షత ప్రదేశాలకు తరలించేదుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ వెంకటలక్ష్మి తెలిపారు. ఏటిపట్టు గ్రామాల ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సుచించారు.

## కోతకు గురైన ఏలేరు కాలువ గట్టు


వీకే రాయపురంలో ఏలేరు కాలువ గట్టును పరిశీలిస్తున్న జేసీ రాహుల్ మీనా, డ్వామా పీడీ, ఎంపీడీఓ, తహసీల్దార్


వీకేరాయపురం ఏలేరు కాలువ గట్టు కోతను జేసీబీతో పూడ్చి వేత పనులు

- అప్రమత్తమైన అధికారులు
- కాలువ గట్టును పరిశీలించిన జేసీ రాహుల్ మీనా

సామర్లకోట: వీకే రాయపురం గ్రామంలో ఏలేరు కాలువ గట్టు ఆదివారం రాత్రి కోతకు గురైంది. ఏలేరు ప్రాజెక్టు నుంచి అదనపు నీటిని విడుదల చేశారు. ఈ వరద నీరు ఏలేరు కాలువ గుండా సముద్రంలో కలుస్తాయి. ఈ నీటి ప్రవాహానికి వీకే రాయపురం వద్ద కాలువ గట్టు కోతకు గురైంది. విషయాన్ని గమనించిన అధికారులు తెల్లవారు జాము నుంచి అప్రమత్తమయ్యారు. ఏలేరు కాలువ గట్టు పరిస్థితి తెలుసుకున్న జేసీ రాహుల్ మీనా వీకే రాయపురం చేరుకొని కోతకు గురవుతున్న గట్టును పరిశీలించారు. ఏలేరు కాలువ గట్టు గండి పడితే గ్రామం పూర్తిగా నీటి మునిగే ప్రమాదం ఉంది. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ దాటిన తరువాత నూతనంగా ఏర్పాటు చేసిన ప్రైవేటు లేఅవుట్ ప్రాంతంలో గట్టు కోతకు గురైంది. ప్రమాదం జరగకుండా ఇసుక బస్తాలతో కోతను పూడ్చి వేయాలని జేసీ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. పొక్లెయిన్ సాయంతో గట్టు కోత పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికలో ప్రారంభించారు. ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించడంతో కాలువలో ఉన్న కాజ్‌వే పూర్తిగా కోట్టుకుపోయింది. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, ఎంపీడీఓ డి.శ్రీలలిత, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీనివాసు, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర రావు, గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి, ఈఓపీఆర్డీ కర్రి సత్యహరి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కుర్రా నారాయణ స్వామి, నిమ్మకాయల రంగనాగ్ లు ఏలేరు కాలువ ఉధృత్తిని, ఏలేరు కాలువ గట్టు పూడ్చి వేత పనులను పరిశీలించారు.


## వరద బాధితులకు అండగా ఉంటాం


గొల్లప్రోలు వద్ద ఏలేరు కాలువను పరిశీలిస్తున్న వంగా గీత తదితరులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత

పిఠాపురం: నియోజకవర్గంలో ఏలేరు వరద బాధితులకు అండగా ఉంటామని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీత తెలిపారు. గొల్లప్రోలులో వరద ముంపు ప్రాంతాలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఏలేరులో అదనపు జలాలను దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో పిఠాపురం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏలేరు పరివాహక ప్రాంతం ప్రజలందరూ తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సహాయక చర్యల్లో పాల్గొని బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. తుపాను కారణంగా అధిక వర్షాలు కురవడం వరదలు వచ్చాయని, బాధితులకు పార్టీ అండగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే పార్టీ కేడర్‌కు సమాచారం ఇచ్చి వారిని సంసిద్ధం చేశామన్నారు. రానున్న రెండు రోజుల్లో వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉన్నందున సహాయక చర్యలకు సహకరించేందుకు అందరినీ సిద్ధం చేశామన్నారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నేతలు బాబీ, సాయిరాం, భూషణం తదితరులున్నారు.

## నీటిని పూర్తిగా తీసి ఎరువులు వేయండి


రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్త సీతారామశర్మ

- ముంపు పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్త

సామర్లకోట: ముంపునకు గురైన పొలాల్లో నీటిని బయటకు తీసి వేసి ఎరువులను వేయాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం డాట్ శాస్త్రవేత్త డాక్టరు ఎ.సీతారామశర్మ అన్నారు. మండల పరిధిలో నీట మునిగిన పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. వీకే రాయపురం గ్రామంలో సుమారు 350 ఎకరాలలో పంట పూర్తిగా మునిగిపోయినట్టు మండల వ్యవసాయాధికారి ఐ.సత్య తెలిపారు. దీనిపై రైతులు వ్యవసాయాధి కారి వద్ద తమకు నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లతామని ఆమె హామీ ఇచ్చారు. మండల పరిధిలో పవర, అచ్చంపేట గ్రామాల్లో నీట మునిగిన పంటలను కూడా శాస్త్రవేత్త పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ పొలాల్లో నీరు పూర్తిగా బయటకు తీసిన తరువాత వరి కాండం దృఢంగా ఉందని భావించిన తరువాత ఎకరానికి 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ ఎరువులను వేయాలని సూచించారు. అదే విధంగా తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ఒక లీటర్ నీటికి ఒక గ్రామం కార్బెండేజిం లేదా రెండు గ్రాముల కార్బన్డిజం, మ్యంకోజైట్ కలిపి పిచికారీ చేయాలన్నారు. పొలాల్లో నీరు బయటకు పోవడానికి కనీసం మూడు రోజులు పడుతుందని రైతులు శాస్త్రవేత్త దృష్టికి తీసుకువెళ్లారు.

### మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

బోట్‌క్లబ్: విడోస్‌హోం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇస్తున్నట్టు విడోస్‌హోం చైర్మన్ పైడా రామకృష్ణారావు సోమవారం విలేకరులకు తెలిపారు. స్థానిక దేవాలయంవీధిలోని పెద్దశివాలయం ఎదురుగా ఉన్న బచ్చు రామేశంసత్రం ఆవరణలో ఈ శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. మూడు నెలల పాటు ఈ శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. మరెన్ని వివరాలకు 9182118499 నంబర్‌కు సంప్రదించవచ్చన్నారు.

### 14న సర్పవరం జంక్షన్‌లో జాబ్‌మేళా

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో ప్రధాన మంత్రి కౌశల్ కేంద్ర(పీఎంకేకే) సెంటరులో ఈనెల 14న హీరో మోటోకార్ప్ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు వీఎస్ఎల్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టరు బి.వంశీ తెలియజేశారు. జాబ్ మేళాలో హీరో మోటో కార్ప్‌తోపాటు డైకిన్, వింగ్ టెక్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, టెన్త్, ఇంటర్ విద్యార్హతతో 34 ఏళ్ల లోపు యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చని సోమవారం ఆయన కోరారు. అసెంబ్లింగ్, మిషిన్ ప్రొడక్షన్, క్వాలిటీ ఆపరేటర్ పోస్టులకు రూ.14 వేలు నుంచి రూ.21 వేలు వరకు జీతం ఉంటుందన్నారు. వివరాలకు సెల్ నంబరు 96665 62358కు సంప్రదించాలని కోరారు.

### ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ


సామర్లకోటలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు కాలువ

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులో ఉన్న ఏలేరు కాలువ సోమవారం ఉధృతంగా ప్రవహించింది. స్థానికంగా వర్షం ప్రభావం లేకపోయినా ఏలేరు ప్రాజెక్టులో అదనపు జలాలను దిగువ ప్రాంతాలకు విడుదల చేసిన విషయం విదితమే. దాంతో స్థానిక పిఠాపురం రోడ్డులోని ఉప్పువారి సత్రం వద్ద ఉన్న ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తూ సామర్లకోట మీదుగా వీకే రాయపురం నుంచి ఇంద్రపాలెం వద్ద ఉన్న ఉప్పుటేరులోనికి ప్రవహించింది. కొంత మేరకు ఉప్పువారి సత్రం నుంచి చంద్రపాలెం మీదుగా నవర ఏలేరులోనికి ప్రవహించింది. ఉప్పువారి సత్రం వద్ద ఉన్న ఏలేరుపై ఉన్న లాకుల నుంచి రైతులు పొలాలకు రాకపోకలు సాగించేవారు. అయితే రెవెన్యూ అధికారులు రైతులను అప్రమత్తం చేసి, రాకపోకలను నిలిపి వేశారు. ఏలేరు కాలువ ఉధృతిని ఆయా పార్టీల నాయకులు సందర్శించారు. రెవెన్యూ అధికారులు ఏలేరు కాలువ వెంబడి నివాసం ఉంటున్న వారిని టిడ్కో ఇళ్లలో దిగువ భాగంలో నివాసం ఉంటున్న వారిని అప్రమత్తం చేశారు.

### ప్రకటన

[illegible]

బి.నాగమణి, అడ్వకేట్